క్లుప్తంగా

పాఠకులు పెరిగేలా చర్యలు చేపట్టాలి



వెలగదుర్రులో రికార్డులు పరిశీలిస్తున్న శేఖర్‌బాబు

ఉండ్రాజవరం : గ్రంథాలయ అనుబంధ బీడీసీ ల్లో పాఠకులు పెరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు సూచించారు. మండలంలోని ఉండ్రాజవరం, వెలగదుర్రు, వేలివెన్ను గ్రామాల్లోని శాఖ గ్రంథాలయం అనుబంధ పుస్తక పంపిణీ కేంద్రాల్లో మంగళవారం ఆయన తనిఖీ నిర్వహించారు. రికార్డులను, రిజిష్టర్లల్లో పాఠకుల సంతకాలను పరిశీలించారు. పాఠకులు పుస్తకాలను ఇంటికి తీసుకువెళ్లేటప్పుడు రిజిష్టర్‌లో తప్పనిసరిగా సంతకం పెట్టించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు గుత్తికొండ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కాల్ధారిలో పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం

ఉండ్రాజవరం: గ్రామాల్లో ప్రాథమిక వైద్యం చేసేటప్పుడు పీఎంపీలు తగిన బాధ్యతతో పని చేయాలని పీఎంపీడబ్ల్యూఏ జిల్లా ప్రెసిడెంట్ రామకృష్ణ అన్నారు. పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ మండల యూనిట్ సర్వసభ్య సమావేశం మండలంలో కాల్ధారి గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి అమృత హాస్పటల్ డాక్టర్స్ వల్లభనేని కిషోర్, డాక్టర్ పి.భార్గవ సాయిరాం పాల్గొని ప్రస్తుతం ఉన్న వైద్య విధానం గురించి, ప్రజల ఆరోగ్య పరిస్థితులపై అవగాహన కల్పించారు. జిల్లా ట్రెజరర్ మల్లేశ్వరరావు, పీఎంపీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

తాళ్లపూడి: ఉపాధ్యాయ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మంగళవారం మలకపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద భోజన విరామ సమయంలో ప్రైమరీ, సబ్జెక్ట్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు ఆధ్వర్యంలో యూటీఎఫ్ కార్యదర్శి ఎం.మనోజ్, రఘువీరశాస్త్రి, జి.సతీష్, రమణ, పాపారావు, చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కస్తూర్బా గాంధీ సర్టిఫికెట్ల అందజేత



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న గాంధేయవాదులు

చాగల్లు: ఈ నెల 22వ తేదీన కస్తూర్బా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని చాగల్లు మండలం మల్లవరం ఆనందనికేతన్ గాంధీ గ్రామ సేవా కేంద్రం, చర్ల సుశీల వృద్ధాశ్రమంలో ఏపీ గాంధీ స్మారకనిధి, జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 23 వరకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పలువురు గాంధేయ వాదులు కస్తూర్బాయ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఐదు నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థుల్లో ప్రతిభ కనబరిచిన వారికి కస్తూరిబా గాంధీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వసుధ ఫౌండేషన్ వారు గాంధీ స్మారక నిధికి లక్ష రూపాయలను, దాత ఎస్ఎల్ఎన్ బాపిరాజు రూ.50వేలను ఏపీ గాంధీ స్మారకనిధి ప్రతినిధి ఇందుకూరి ప్రసాద రాజుకు అందజేశారు. మాజీ సర్పంచ్ లకంసాని సూర్యప్రకాశరావు, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు చర్ల మృధుల, కరుటూరి జగన్, బండి వెంకటేశ్వరరావు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆశ్రమవాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు పట్టణంలో ఇంటింటా ప్రచారం

కొవ్వూరు: ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు చేపట్టిన ఇంటింటా ప్రచారం బుధవారం ఉదయం ఆరు, ఏడు, ఎనిమిది వార్డుల్లో నిర్వహించనున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

కరపత్రాల ఆవిష్కరణ

నిడదవోలు: సావిత్రిబాయి పూలే వర్ధంతి సభను విజయవంతం చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి ప్రతినిధులు కోరారు. స్థానిక రైల్వేస్టేషన్ సెంటర్‌లో కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో జరగనున్న సావిత్రిబాయి పూలే వర్ధంతి సభను విజయవంతం చేద్దాం అనే కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా కార్యదర్శి గెద్దం రవీంద్రబాబు, మెరుపో జూన్‌రాజ్, ఎం. శ్రీను, కె.రామదాసు, శ్రీను, సతియ్య, బాబురావు, రామయ్య, సుబ్బారావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

నల్లజర్ల: ఒడిశా రాష్ట్రం నవరంగ్ పూర్ నుంచి విజయవాడ వెళుతున్న ఆ రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు బస్సు మంగళవారం ఉదయం 5.30 గంటలకు నల్లజర్ల చెక్ పోస్ట్ సెంటర్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టింది. అనంతరం టైరు పంచర్ అయి కుడి వైపునకు 60 మీటర్లు దూసుకుపోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. వీరందరిని మరో బస్సులో విజయవాడ పంపారు.

టిప్ టాప్ ట్యాబ్‌గా..



దూబచర్ల జెడ్పీ హైస్కూలులో ట్యాబ్‌లతో విద్యార్థులు

- ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్య
- ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత
- బైజూస్ యాప్ ద్వారా డిజిటల్ పాఠాలు
- విద్యార్థుల్లో ఆంగ్లంపై పెరుగుతున్న పట్టు, పరిజ్ఞానం

నల్లజర్ల: ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చింది. కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించింది. విద్యార్థులు ఉన్నతంగా రాణించేందుకు నూతన విధానాలను ప్రోత్సాహిస్తోంది. ముఖ్యంగా విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులో ఉంచింది. అందులో భాగంగా ఎనిమిదో తరగతి విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ట్యాబ్‌లను అందించింది. వాటిలో బైజూస్ యాప్ ఇన్‌స్టాల్ చేసి వినూత్న కంటెంట్‌ను పిల్లలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. తరగతి గదుల్లో విద్యార్థులకు డిజిటల్ పాఠాలు బోధిస్తున్నారు. దీంతో సర్కారు పాఠశాల విద్యార్థులు అన్నింటా రాణిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వ చిత్తశుద్ధిపై అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

64జీబీ ఎస్‌డీ కార్డుతో పాఠాలు అప్‌లోడ్

పేద విద్యార్థులు విద్యాభివృద్ధికి అధిక ప్రాముఖ్యత ఇస్తున్న ప్రభుత్వం ఎటువంటి ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తోంది. డిజిటల్ బోధన కోసం విద్యారంగంలో ప్రసిద్ధి చెందిన బైజ్యూస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థ సబ్జెక్ట్‌ల వారీగా రూపొందించిన పాఠాలతో కూడిన 64జీబీ ఎస్‌డీ కార్డును ట్యాబ్‌లో అప్‌లోడ్ చేసి పంపిణీ చేశారు. ఆఫ్‌లైన్‌లోను విద్యార్థులు పాఠాలు వినేలా ట్యాబ్‌ను రూపొందించారు. ప్రభుత్వ పాఠశాల ఇన్ఫోలో నమోదైన ప్రతి ఎనిమిదో తరగతి విద్యార్థికి ట్యాబ్‌లు అందించారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ, హిందీతో పాటు ఆరు భాషల్లో ఈ కంటెంట్ లభ్యమవుతుంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ బయాలజీ, గణితం, సోషల్ పాఠాలను విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా యానిమేషన్, వీడియో, ఆడియోలతో బైజూస్ కంటెంట్ రూపొందించారు. ఇందులో మాక్‌టెస్ట్‌లు కూడా అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు 9, 10 తరగతులకు వెళ్లే సమయానికి ఆయా తరగతుల పాఠ్యాంశాలకు సంబంధించిన కంటెంట్‌ను అప్‌లోడ్ చేస్తారు. దీని వల్ల విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెరగడంతో పాటు ఆంగ్లంపై పట్టు, నైపుణ్యాలు, పోటీతత్వం పెంపొందే అవకాశం ఉంది.

సులభంగా అర్థమవుతున్నాయి



పాఠశాల ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. ఇంటికి వెళ్లగానే ట్యాబ్‌ల ద్వారా మళ్లీ పాఠాలను అవగాహన చేసుకుంటున్నాం. బైజ్యూస్ యాప్ ద్వారా ఎంతో సులభంగా పాఠ్యాంశాలు అర్థమవుతున్నాయి.

– జి.రమ్యశ్రీ, తొమ్మిదో తరగతి, దూబచర్ల

ఎంతో ఉపయోగకరం



సీఎం జగన్ ఇచ్చిన ట్యాబ్‌లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. బైజూస్ యాప్‌తో డిజిటల్ విద్యకు అలవాటు పడుతున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, బైజూస్ యాప్ ద్వారా పాఠ్యాంశాలు నేర్పించడంతో అన్ని విషయాలపై అవగాహన కలుగుతోంది.

– వి.మణికంఠశ్రీదుర్గ, తొమ్మిదో తరగతి విద్యార్థి, దూబచర్ల

రుణపడి ఉంటాం



విద్యతో పాటు సాంకేతిక మార్పులకు అనుగుణంగా జగనన్న ఇచ్చిన ట్యాబ్‌లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఉపాధ్యాయులు విద్య బోధించే సమయంలో తెలియని విషయాలను తెలుసుకుంటున్నాం. బైజ్యూస్ కంటెంట్ ద్వారా ఇంగ్లీషు బోధనను సులువుగా అర్థం చేసుకోగల్గుతున్నాం.

– జి.మహేశ్వరి, ఎనిమిదో తరగతి, దూబచర్ల

జగన్ మామయ్యకు థాంక్యూ



ముఖ్యమంత్రి జగన్ మామయ్య మాకు యూనీఫాం, పుస్తకాలతో పాటు సాంకేతిక విజ్ఞానం అందిస్తున్నారు. ఆయన సహాయం మర్చిపోలేం. పెంపొందించుకునేందుకు బైజ్యూస్ యాప్‌లో కూడిన ట్యాబ్ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది. ఎప్పటికప్పుడు పాఠ్యాంశాలు అవగాహన చేసుకుంటున్నాం. మా కోసం ఇన్ని చేస్తున్న జగన్‌మామయ్య గ్రేట్.

– బి.సింధు, ఎనిమిదో తరగతి, దూబచర్ల

సాయం మరువలేం



ప్రభుత్వం అందించిన ట్యాబ్ ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం. పరీక్షలు సులువుగా రాయగలుగుతున్నాం. మంచి మార్కులు వస్తున్నాయి. ట్యాబ్‌లో పాఠ్యాంశాలన్నీ ఉండడంతో ఎప్పుడు డౌట్ వస్తే అప్పుడు చూసుకుంటున్నాం. దీంతో సందేహాలు తీరి పరీక్షలు మంచిగా రాస్తున్నాం. ఇంత సాయం చేస్తున్న సీఎం జగన్ మేలు మరువలేం.

– కె.చిత్రసాయి, తొమ్మిదో తరగతి, దూబచర్ల

సంతోషంగా ఉంది



ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన, డిజిటల్ విద్యను అందించడం సంతోషంగా ఉంది. బైజూస్ పాఠాలు బయట కొనే ఆర్థిక స్థోమత మాకు లేదు. సీఎం జగన్ ట్యాబులు అందించి మా భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నారు. ఆయన మాపై పెట్టుకున్న ఆశలు నెరవేరుస్తాం.

– కె.హరిత సాయి ప్రియ, ఎనిమిదో తరగతి, దూబచర్ల

దొండపూడి రోడ్డుకు మోక్షం

- 2.50 కోట్లతో రోడ్డు నిర్మాణానికి శ్రీకారం
- హామీని అమలు చేసిన మంత్రి వనిత
- కృతజ్ఞతలు తెలిపిన 10 గ్రామాల నాయకులు



దొండపూడి రోడ్డునిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి తానేటి వనిత, నాయకులు

గోపాలపురం: ఎన్నో ఏళ్ల సమస్యగా ఉన్న దొండపూడి రోడ్డుకు మోక్షం లభించింది. నాలుగు రోజులు క్రితం రాష్ట్ర హోం విపత్తుల శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత కొవ్వూరుపాడు పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు మంగళవారం గోపాలపురంలో రూ.2.50 కోట్లతో రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 20 రోజుల్లో బీటీ రోడ్డు నిర్మించాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. దీంతో రోడ్డు నిర్మాణంలో ఇప్పటి వరకూ అనేక ఇబ్బందులు పడిన పది గ్రామాల ప్రజలు నాయకులు మంత్రి వనితకు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి ఆర్‌అండ్‌బీ నిధులు కేటాయించిన జగన్మోహన్‌రెడ్డికి మంత్రి వనిత ధన్యవాదాలు తెలిపారు. అక్క దేవతలకు పసుపు కుంకుమలు అందజేసిన మంత్రి భీమోలు గ్రామంలో ఉన్న అక్కదేవతల ఆలయంలో అమ్మవారిని మంగళవారం మంత్రి వనిత దర్శించి, పూజలు చేశారు. చీర పసుపు కుంకుమలు సమర్పించారు. నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, వెలగా శ్రీరామమూర్తి, ముల్లంగిశ్యామ్‌రెడ్డి, శాప్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, సర్పంచ్ శిరీష, అప్పరెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

బాబోయ్.. పులి మళ్లీ వచ్చింది

గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో సంచారం

దేవరపల్లి, గోపాలపురం: అడవిలోకి వెళ్లిపోయిందనుకున్న పెద్దపులి ఆనవాళ్లు మళ్లీ కనిపించడంతో మెట్ట ప్రాంతంలో కలకలం రేగింది. దాదాపు రెండు నెలలుగా ఏలూరు జిల్లా ఏలూరు, పెదవేగి, పోలవరం, బుట్టాయగూడెం, కొవ్వాడ; మన జిల్లాలోని నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాల్లోని పలు గ్రామాల్లో పులి సంచరించిన విషయం తెలిసిందే. ఇటీవల గోపాలపురం మండలం కరగపాడు వద్ద ఓ పందిని, కొవ్వాడ వద్ద ఆవును ఈ పులి చంపేసింది. తర్వాత అది పాపికొండలు అభయారణ్యంలోకి వెళ్లిపోయిందని అటవీ అధికారులు ప్రకటించారు. రెండు వారాలుగా ఎక్కడా పులి జాడ లేకపోవడంతో రైతులు, కూలీలు ధైర్యంగా పొలాలకు వెళుతున్నారు. ఇంతలోనే మళ్లీ సోమవారం రాత్రి దేవరపల్లి మండలం బంధపురం, గోపాలపురం మండలం చెరుకుమిల్లి, పెద్దాపురం గ్రామాల్లోని జీడిమామిడి, పొగాకు తోటల్లో ఈ పులి ఆనవాళ్లను రైతులు గుర్తించారు. పాదముద్రల ఆధారంగా అది బంధపురం నుంచి పెద్దాపురం వరకూ పోలవరం కుడి ప్రధాన కాలువ గట్టుపై సుమారు 3 కిలోమీటర్ల పొడవునా సంచరించినట్లు మంగళవారం ఉదయం గుర్తించారు. బంధపురం సర్పంచ్ కాట్రగడ్డ పరమేశ్వరరావు ఇచ్చిన సమాచారం మేరకు అటవీ అధికారులు హుటాహుటిన పోలవరం గట్టుకు చేరుకున్నారు. పాద ముద్ర 11 సెంటీమీటర్లు ఉండటంతో ఆ పులి పెద్దదేనని భావిస్తున్నారు. రైతులు, కూలీలు ఉదయం 9 గంటల వరకూ పొలాలకు వెళ్లరాదని, గుంపులుగానే వెళ్లాలని, సాయంత్రం 5 దాటిన తర్వాత పొలాల్లో ఉండవద్దని, పశువులను ఇళ్లకు చేర్చుకోవాలని సూచించారు. పులి సంచారంపై వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఈ పెద్దపులి కాలువ గట్టు వెంబడి పొలాల నుంచి వచ్చి గోపాలపురం మండలం చేరిందని తెలిపారు. ఈ పులిని తక్షణం పట్టుకుని సంరక్షణ ప్రాంతానికి తరలించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

- మంత్రి తానేటి వనిత
- వలంటీర్లకు పురస్కారాలు



గోపాలపురంలో దివ్యాంగ వలంటీరుకు సేవా వజ్ర పురస్కారాన్ని అందజేస్తున్న మంత్రి వనిత

గోపాలపురం: వలంటీర్ల సేవలు అభినందనీయమని రాష్ట్ర హోం, విపత్తుల శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. స్థానిక ఏఎంసీ కార్యాలయ ఆవరణలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి వనిత మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలపై ఆయన పూర్తి నమ్మకాన్ని పెట్టుకున్నారని, జగనన్న మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటారని వలంటీర్లకు భరోసా కల్పించారు. అవగాహన లేని ఇతర పార్టీ నాయకులు మీమీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మీరు వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలను 262 మంది వలంటీర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రమేష్‌బాబు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, వెలగా శ్రీరామమూర్తి, మండల పార్టీ కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, పఠాన్ అన్సర్‌భాషా, శాప్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

109 క్షయ రహిత గ్రామాల గుర్తింపు

చాగల్లు: జిల్లాలో 109 క్షయ రహిత గ్రామాలను గుర్తించినట్టు జిల్లా లెప్రసీ ఎయిడ్స్, క్షయ వ్యాధి నివారణాధికారి డాక్టర్ ఎస్.వసుంధర అన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా నందిగంపాడులో మంగళవారం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆమె మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ పంచాయతీల్లో భాగంగా నందిగంపాడు గ్రామాన్ని టీబీ రహిత గ్రామంగా ఎంపిక చేశామని చెప్పారు. క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా చేస్తారని, వ్యాధి నిర్ధారణ అయితే తగ్గే వరకూ ఉచితంగా చికిత్స చేస్తారని బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ నిశిత తెలిపారు. రెండు వారాల పాటు దగ్గు, జ్వరం ఉంటే కచ్చితంగా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుదప రాంబాబు, డాక్టర్ దీప్తి, పీహెచ్‌సీ సిబ్బంది, టీబీ యూనిట్ సిబ్బంది ఉన్నారు.

క్షయ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దటమే లక్ష్యం

పెరవలి: జిల్లాలో అన్ని గ్రామాలను క్షయ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దటమే తక్షణ కర్తవ్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వసుంధర పేర్కొన్నారు. పెరవలి మండలం కానూరు, పెరవలి పీహెచ్‌సీలను మంగళవారం ఆమె సందర్శించి వైద్యులతో క్షయ వ్యాధిపై తీసుకోవలసిన జాగ్రత్తలు, చర్యలు గురించి చర్చించారు. అనంతరం కానూరు అగ్రహారం, పెరవలి, అజ్జరం గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపికి కార్పొరేట్ల ప్రసాద్, వైద్యాధికారులు హేమరాజు, విజయ్‌కుమార్, దీప్తి,టిబి ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ ఆశాజ్యోతి, సర్పంచ్‌లో దాసం వెంకన్న, గార్లపాటి సుధా భూషణం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు మద్దతుగా నిలవాలి

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- అభివృద్ధి పనుల ప్రారంభం



కోరుమామిడిలో సచివాలయ భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పాలనకు ప్రజలంతా మళ్లీ మద్దతు పలకాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు కోరారు. నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.23.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం, రూ.23.94 లక్షలతో నిర్మించి వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే)లను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కోరుమామిడిలో రూ.30.14 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.9.60 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అంబటి గోపమ్మ, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి, సొసైటీ అధ్యక్షుడు వింతా గంగాధర్‌రెడ్డి యాళ్ల రామారావు, నాయకులు పాల్గొన్నారు.

మంచి చేస్తున్నాం.. ప్రజల్లో ఉంటున్నాం..



వేలివెన్నులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

ఉండ్రాజవరం : రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ అను నిత్యం ప్రజల కోసం పరితపించడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నైజమని, అందుకే తాను ధైర్యంగా ప్రజల ముందుకు వస్తున్నట్టు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. వేలివెన్ను గ్రామంలో సీతారామ్‌పేటలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య ఆధ్వర్యంలో మూడోరోజు మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మల్లిపూడి పాప, మారిశెట్టి సూరిబాబు, కంజులూరి శ్రీనివాసు, దిద్దుపూడి గోపాలం, షేక్ మస్తాన్, ఆకుల వెంకటేష్, చదలవాడ హరీష్, బోగవల్లి కృష్ణారావు, కంటిపూడి త్రిమూర్తులు, దాసర్తి నాగేశ్వరరావు, మద్దుకూరి సత్యనారాయణ, చిట్టూరి జగదీష్ చౌదరి, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డిలను కలిసిన తోట



సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రామకృష్ణ



మిథున్‌రెడ్డికి శ్రీరాముడి ప్రతిమ అందజేస్తున్న రామకృష్ణ

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి రాజ్యసభ సభ్యులుగా నియమితులైన సందర్భంగా మంగళవారం తాడేపల్లిలో గృహం వద్ద పెద్దేవంకు చెందిన రాష్ట్ర కాపు జేఏసీ నాయకుడు, వైఎస్సార్ సీపీ నాయకులు తోట రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన 3వ సిద్ధం సభకు 10 లక్షలకు పైగా జన సునామీ సృష్టించిన సందర్భంగా తాడేపల్లిలో ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ శ్రీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ 2024లో మనం గెలిపించుకోవాలని అయోధ్య శ్రీరామ ప్రతిమను మిధున్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారు రామకృష్ణను అభినందించినట్టు తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



స్వామివారి కల్యాణం

నిడదవోలు: పట్టణంలోని బసివిరెడ్డిపేటలో పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ ఒడ్డున ఉన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం రాత్రి అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సహస్రనామార్చనలు, అభిషేకాలను నిర్వహించారు. స్వామివారి దివ్య కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో వెలగల జయచంద్రారెడ్డి, కేదారిశెటి నెహ్రూ, అర్చకులు రాము తదితరులు పాల్గొన్నారు.

నర్సింహ స్వామి రథోత్సవం

నల్లజర్ల: గ్రామంలోని శ్రీరామకృష్ణ భక్త మందిరంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఆశీనులు చేసి పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం వెల్లంకివెంకట సుబ్రహ్మణ్యం దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతమాచరించిన అనంతరం ఏకాహమహోత్సవం ప్రారంభమైంది. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా ధర్మేశ్వరస్వామి కల్యాణం

ఉండ్రాజవరం: దమ్మెన్నులో ఉన్న పార్వతీ సమేత ధర్మేశ్వరస్వామి వారి దివ్య కల్యాణం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కాల్ధారీ వెంకటసూర్య సత్యనారాయణ పంతులు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణలతో మంగళ వాయిద్యాల మధ్య ధర్మేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుర్లజర్ల సత్యనారాయణ, వెంకటలక్ష్మి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి, పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణోత్సవం ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్రంశెట్టి వెంకటేశ్వరరావు, సభ్యులు, కార్యనిర్వహణాధికారి సోమల శివ పరివేక్షించారు. ఈకల్యాణాన్ని అధిక సంఖ్యలో భక్తులు వీక్షించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అందుబాటులో ఉంటా ఆశీర్వదించండి



కొవ్వూరులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ శివరామకృష్ణ

కొవ్వూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను ఆదరించి ఆశీర్వదించాలని, నిరంతరం ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు కోరారు. పట్టణంలో ఉదయం పూట నాలుగు, మూడు వార్డులు, మధ్యాహ్నం ఒకటి, రెండు వార్డులో ప్రజా ఆశీర్వాదం కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలో ప్రతి ఇంటికీ వెళ్లి గడిచిన 58 నెలల కాలంలో వైఎస్సార్ సీపీ చేపట్టిన సంక్షేమ పథకాలు వివరించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాల ద్వారా మేలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయా వార్డుల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్న కుమారి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, వైస్ చైర్ పర్సన్లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గంధ శేషసాయి, వైస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, శ్రీరామ సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర,మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో లేని వైద్యులు

నల్లజర్ల: పేదలందరికీ పూర్తి స్థయిలో వైద్యం అందాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పూర్తి స్థాయి వసతులు, వైద్యులు, సిబ్బందిని నియమించింది. అందరికీ మెరుగైన వైద్యం అందాలని కోట్లాది రూపాయాలు ఖర్చు చేస్తోంది. అయితే మండలంలోని పోతవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. మంగళవారం ఉదయం 11.30 సమయంలో విలేకర్ల బృందం ఈపీహెచ్‌సీని సందర్శించినపుడు డ్యూటీలో ఉండాల్సిన ఇద్దరు డాక్టర్లు అందుబాటులో లేక పోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనం ఇస్తున్నాయి. స్టాఫ్‌నర్సే రోగులను చూసి పంపిస్తున్నారు. 14మంది ఉండాల్సిన ఈపీహెచ్‌సీలో కేవలం ఐదారుగురు మాత్రమే డ్యూటీలో ఉన్నారు. ఒక డాక్టరు 23న జరగబోయే జగనన్న సురక్ష కార్యక్రమం కోసం తెలికిచెర్ల వెళ్లి నట్టుగా చెబుతున్నారు. మరో డాక్టరు సిబ్బంది జీతభత్యాలు రికార్డు చేయించడానికి తాడేపల్లిగూడెం వెళ్లారని సిబ్బంది చెబుతున్నారు. అయితే ప్రజల ఆరోగ్యం కంటే ఇటువంటి పనులే ముఖ్యమా అంటూ ఆసుపత్రికి వచ్చిన రోగులు ప్రశ్నిస్తున్నారు. ఈవిషయమై జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరావును ఫోన్‌లో సంప్రదించగా బిజీ,బిజీ వచ్చింది. దీనిపై ఉన్నతాధికారులు తగుచర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.